# నర్సింగ్ ఆఫీసర్లకు జీతాలేవి?



- మూడు నెలల కిందే నియామకం
- కరీంనగర్ ప్రభుత్వ దవాఖానలో విధులు
- అప్పటి నుంచీ అందని సాలరీలు
- సీపీఎస్, ఐడీ నంబర్ల జారీలో నిర్లక్ష్యమే కారణం
- పట్టని ఉన్నతాధికారులు
- ఇబ్బందుల్లో 200 మంది ఉద్యోగులు

**నర్సింగ్ ఆఫీసర్ల కడుపుమాడుతున్నది. జీతాలు అందక బతుకు ఆగమైపోతున్నది. డిస్ట్రిక్ మెడికల్ ఎడ్యుకేషన్ కింద గత ఫిబ్రవరిలోనే నియమితులై కరీంనగర్ గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌లో విధులు నిర్వహిస్తుండగా, వారికి ఉద్యోగం వచ్చిందనే సంబురమే లేకుండా పోయింది. సీపీఎస్, ఐడీ నంబర్ల జారీలో ట్రెజరీ, జీజీహెచ్ విభాగాల్లోని అధికారుల నిర్లక్ష్యంతో మూడు నెలలుగా శాలరీల చెల్లింపు ప్రక్రియ నిలిచిపోగా, వారి పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది.**



విద్యానగర్, మే 22: రాష్ట్ర ప్రభుత్వం కరీంనగర్ జిల్లాలో 200 మంది నర్సింగ్ ఆఫీసర్లను గత ఫిబ్రవరిలో నియమించింది. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా నియామక ఉత్తర్వులు అందించారు. అంతేకాదు, స్టాఫ్ నర్సుల పేరును నర్సింగ్ ఆఫీసర్లుగా మార్చుతూ నిర్ణయం కూడా తీసుకున్నారు. డిస్ట్రిక్ మెడికల్ ఎడ్యుకేషన్ కింద నియమితులైన వారికి కరీంనగర్ గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్(జీజీహెచ్)లో విధులు అప్పగించింది. అయితే వారికి ఉద్యోగంలో చేరామనే సంతోషమే లేకుండా పోయింది. సీపీఎస్, ఐడీ నంబర్లు జారీ చేయకపోవడంతో ఇప్పటి వరకు జీతాలు రావడం లేదు. నిజానికి వీరు చేరిన నెలలోనే ఈ నంబర్లు ఇచ్చి వేతనాలు అందేలా చూడాలి. అయితే మరి స్థానికంగా జరిగిన పొరపాటా..? ట్రెజరీ అధికారుల నిర్లక్ష్యమా..? తెలియదుగానీ శాలరీ నిలిచిపోయి ఇబ్బందులు పడుతున్నారు. అటు ట్రెజరీ, జీజీహెచ్‌లోని సంబంధిత సెక్షన్ల చుట్టూ తిరుగుతున్నారు. ట్రెజరీలో అడిగితే సంబంధిత సెక్షన్ నుంచి తమకు వేతన బిల్లులు రావడం లేదని చెబుతుండగా, ట్రెజరీ అధికారులు సీపీఎస్, ఐడీ నంబర్లు ఇస్తేనే బిల్లులు చెల్లించే అవకాశం ఉంటుందని సెక్షన్ ఆఫీసర్లు చెబుతున్నారు. ట్రెజరీ, జీజీహెచ్ సంబంధిత క్లర్కుల నిర్లక్ష్యంతోనే వేతనాలు ఆగిపోతున్నాయని నర్సింగ్ ఆఫీసర్లు వాపోతున్నారు. ఈ నెల 25లోగా బిల్లులు అప్పగిస్తే తప్ప వచ్చేనెల వేతనాలు అందే పరిస్థితి కనిపించకపోవడంతో ఈ విషయంలో ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలని కోరుతున్నారు.

### వేతనాలు అందిస్తాం

కరీంనగర్ గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌లో పనిచేస్తున్న 200 మంది నర్సింగ్ ఆఫీసర్లుకు ఐడీ, సీపీఎస్ నంబర్లు రాకపోవడంతో వేతనాల చెల్లింపులో జాప్యం జరుగుతున్నది. ఇప్పటికే ట్రెజరీ అధికారులతో మాట్లాడాం. ఐడీ నెంబర్లు వచ్చాయి. అలాగే 50 మందికి సీపీఎస్ నంబర్లు కూడా కేటాయింపు జరిగింది. మరో 150 మందివి నేడో, రేపో పూర్తవుతాయని ట్రెజరీ ఆఫీసర్లు చెబుతున్నరు. మొత్తం మీద ఈ నెల 25లోగా బిల్లులు చేసి వేతనాలు వచ్చేలా చర్యలు తీసుకుంటాం. అయితే ఇన్ని రోజులు జరిగిన జాప్యానికి గల కారణాలను తెలుసుకొని ఉన్నతాధికారులకు నివేదిస్తా.

**- గుండా వీరారెడ్డి, జీజీహెచ్ సూపరింటెండెంట్ (కరీంనగర్)**

# జనరల్ హాస్పిటల్‌లోనే మెడికల్ సర్టిఫికెట్లు

కరీంనగర్ జీజీహెచ్ సూపరింటెండెంట్ గుండా వీరారెడ్డి



కరీంనగర్ విద్యానగర్, మే 22: ప్రభుత్వ జనరల్ దవాఖాన, కరీంనగర్‌లోని కార్యాలయంలో ₹100 చెల్లించి సంబంధిత వైద్యుల నుంచి ఉద్యోగులు మెడికల్ సర్టిఫికెట్లు తీసుకోవాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ గుండా వీరారెడ్డి సూచించారు. సర్టిఫికెట్ల కోసం వచ్చే పేదల నుంచి కొంతమంది సిబ్బంది అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. సర్టిఫికెట్ల కోసం ఎవరినీ ఆశ్రయించకుండా నేరుగా జీజీహెచ్ కరీంనగర్‌కే రావాలని సూచించారు. కొంతమంది జిరాక్స్ సెంటర్లతో కుమ్మక్కు అవుతున్నారని తెలియడంతో ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. కేవలం జీజీహెచ్, కరీంనగర్ ఉన్న స్టాంప్ మెడికల్ సర్టిఫికెట్లు చెల్లుబాటు అయ్యేవిధంగా ఉన్నతాధికారులకు సిఫారసు చేస్తామన్నారు. కొంతమంది సిబ్బంది దగ్గర ఇప్పటికే పెద్ద మొత్తంలో గ్రీన్ పెన్నులతో స్టాంపులను స్వాధీనం చేసుకున్నామని, ఇప్పటికైనా వారు పద్ధతి మార్చుకోకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# వివాదాస్పదం విద్యాశాఖ సస్పెన్షన్లు

## హాట్ టాపిక్‌గా మహిళా టీచర్ల సస్పెన్షన్



**ఇటీవల ఇద్దరు మహిళా టీచర్లను సస్పెండ్ చేస్తూ కరీంనగర్ జిల్లా విద్యాశాఖ ఇచ్చిన ఉత్తర్వులు ప్రస్తుతం వివాదాస్పదమవుతున్నాయి. పాఠశాలకు వెళ్లాలంటూ అధికారికంగా ఎలాంటి ఆదేశాలు ఇవ్వకపోగా.. కనీసం వివరణ తీసుకోకుండానే విధుల నుంచి ఎలా తొలగిస్తారన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. టీచర్ల సస్పెన్షన్ అన్యాయమంటూ ఉపాధ్యాయులు బాహాటంగా చెప్పడంతోపాటు ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు బాధితులు నానా తంటాలు పడుతున్నారు. ఉపాధ్యాయ సంఘాల తీరును సోషల్ మీడియా వేదికగా వేలాది మంది టీచర్లు తప్పు పడుతున్నారు. పదో తరగతి స్పాట్ సందర్భంగా ఇద్దరు సంఘ నాయకులను సస్పెండ్ చేస్తే.. ఎత్తివేసే వరకు ఒక్కతాటిపైకి వచ్చి పోరాడిన అన్ని సంఘాలు.. మహిళా ఉపాధ్యాయుల విషయంలో ఎందుకు చొరవ చూపడం లేదని ప్రశ్నలవర్షం కురిపిస్తున్నారు. నాయకులకైతే ఓ నీతి.. సాధారణ ఉపాధ్యాయులకైతే మరో నీతా..? అంటూ సంఘ నాయకులను తూర్పార పడుతున్నారు. సభ్యత్వాలు, స్వప్రయోజనాలు తప్ప నిబంధనలకు విరుద్ధంగా జరిగిన సస్పెన్షన్లపై ఎందుకు నోరు మెదపడం లేదంటూ ప్రశ్నిస్తున్న తీరు ప్రస్తుతం కరీంనగర్ జిల్లా విద్యాశాఖలో చర్చనీయాంశంగా మారింది.**

- నిబంధనలకు విరుద్ధమంటున్న ఉపాధ్యాయులు
- వివరణ కోరకుండానే చర్యలు ఎలా తీసుకుంటారని ఆవేదన
- సంఘాల స్పందన తీరు నామమాత్రమేనంటూ తీవ్ర విమర్శలు
- నాయకులు సస్పెండ్ అయినప్పుడు ఐక్యతారాగం
- ఇప్పుడేమో చేతులు దులుపుకునే ప్రయత్నాలు
- సోషల్ మీడియా వేదికగా తూర్పార
- సభ్యత్వం, స్వప్రయోజనాల కోసమే తప్ప న్యాయం వైపు నిలబడడం లేదంటూ ఘాటుగా ఆరోపణలు
- విద్యాశాఖలో వింత పోకడలు

కరీంనగర్, మే 22 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలోని నవాబుపేట, సైదాపూర్ మండలంలోని తండా ప్రాథమిక పాఠశాలల్లో ఎస్జీటీలు ఏ మంగ, బీ సునీతను సస్పెండ్ చేస్తూ డీఈవో ఈ నెల 18న ఉత్తర్వులు జారీ చేశారు. సదరు పాఠశాల్లో ఇతరులు నివసిస్తున్నారనే కారణాలు చూపుతూ వారిని సస్పెండ్ చేశారు. ఈ రెండు మండలాల ఎంఈవోలకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఇదే రోజు కరీంనగర్‌లోని ఫకీర్‌నగర్ ప్రాథమికోన్నత పాఠశాల్లో ఎస్జీటీ ఎన్ మంజుల చాలా రోజులుగా గైర్హాజరు కావడంతో సస్పెండ్ చేసినట్లు తెలిపారు. ఈ విషయంలో పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు, కరీంనగర్ ఎంఈవోను వివరణ కోరినట్టు అందులో పేర్కొన్నారు. అయితే పాఠశాలల్లో ఇతరులు నివసిస్తున్నారనే కారణంతో ఇద్దరు మహిళా టీచర్లపై వేటు వేయడం ప్రస్తుతం విద్యాశాఖలో వివాదాస్పదమవుతున్నది. ఈ విషయంలో సంఘాలు అనుసరిస్తున్న తీరు సోషల్ మీడియాలో పెద్ద దూమారమే లేపుతున్నది.

### సస్పెన్షన్లు చర్చనీయాంశం

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేస్తూ ఇటీవల కాంగ్రెస్ సర్కారు నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. పాఠశాల ప్రారంభానికి ముందే.. పలు పాఠశాలల్లో రిపేర్ చేయాల్సిన పనుల కోసం కొన్ని నిధులను ఈ పథకం కింద కేటాయించింది. ఈ పనులు సాగుతున్న నేపథ్యంలో ప్రతి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మే ఒకటి నుంచి పాఠశాలలకు వెళ్లాల్సిందిగా జిల్లా విద్యాశాఖ ఉత్తర్వులు ఇచ్చింది. కానీ, ఈ ఆదేశాలను ప్రాథమిక పాఠశాలలకు జారీ చేయలేదు. కనీసం మౌఖిక ఆదేశాలు కూడా ఇవ్వలేదు. వేసవి సెలవులు కావడంతో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ఇంటి వద్దే ఉన్నారు. కాగా, ఇటీవల నవాబుపేట, తండా పాఠశాలలను ఉన్నతాధికారులు తనిఖీ చేయగా, ఆ స్కూళ్లలో ఇతరులు నివసిస్తున్నట్టు గుర్తించారు. ఈ అంశాన్ని పరిగణలోకి తీసుకొని.. సదరు పాఠశాలల్లో పనిచేస్తున్న ఇద్దరు మహిళా ఉపాధ్యాయులను జిల్లా విద్యాశాఖ సస్పెండ్ చేస్తూ ఈ నెల 18న ఉత్తర్వులు జారీ చేసింది. ఇది పూర్తిగా నిబంధనలకు విరుద్ధమని ఉపాధ్యాయులు చెబుతున్నారు. నిజానికి పాఠశాలలకు వెళ్లాలని తమకు ఆదేశాలు రాలేదని, ఎవరో నివసిస్తున్న విషయం తమ దృష్టికి రాలేదని సదరు ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. ఒక వేళ ఉన్నతాధికారులు గుర్తించిన సమయంలో తమకు సమాచారమిస్తే వారిని ఖాళీ చేయించే వాళ్లమని, తమతో ఆ పని కానప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చే వాళ్లమని స్పష్టం చేస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలను తాము ధిక్కరించినా.. విధి నిర్వహణలో నిర్లక్ష్యం చూపినా.. తమను బాధ్యులను చేస్తే తప్పులేదు కానీ, తమకు సంబంధం లేని విషయంలో తమను బలిచేయడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఇది ఇద్దరు మహిళా టీచర్లకు జరిగిన అన్యాయంగా భావించడం లేదని, ఇలాగే కొనసాగితే మరింత మంది ఉపాధ్యాయులు బలి కావాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. అలాగే ఉన్నతాధికారుల దృష్టికి విషయం వచ్చినప్పుడు.. తమను వివరణ కోరితే బాగుండేదని, తమ వర్షన్ తీసుకోకుండానే ఏకపక్షంగా ఎలా సస్పెండ్ చేస్తారని ప్రశ్నిస్తున్నారు. మహిళా టీచర్లకు జరిగిన అన్యాయాన్ని ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లేందుకు.. కొంత మంది ఉపాధ్యాయులు నానా తంటాలు పడుతున్నారు.

### సోషల్ మీడియా వేదికగా తూర్పార

పాత అంశంతోపాటు ఇప్పుడు మహిళా టీచర్ల సస్పెన్షన్ వ్యవహారాన్ని పలువురు ఉపాధ్యాయులు సోషల్ మీడియా వేదికగా తూర్పార పడుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా మహిళా టీచర్ల సస్పెన్షన్ జరిగిందంటూ ముక్తకంఠంతో చెబుతున్నారు. జరిగిన అన్యాయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, సదరు టీచర్లకు న్యాయం జరిగేలా పోరాడాల్సిన సంఘాలు 'ఎవరికి వారే యమునా తీరే' అన్నట్టు ప్రవర్తిస్తున్నాయని మండిపడుతున్నారు. నాయకుల సస్పెన్షన్ విషయంలో ఏకతాటిపైకి వచ్చిన సంఘాలు, ప్రస్తుతం మాత్రం ఏకతాటిపైకి రాకుండా విడివిడిగా అధికారులను కలువడం వెనుక ఆంతర్యమేంటని సోషల్ మీడియాలో ప్రశ్నిస్తున్నారు. 'కేవలం సభ్యత్వాలు, స్వప్రయోజనాల కోసమే సంఘాలు పనిచేస్తయా..? ఉపాధ్యాయులకు అన్యాయం జరిగితే అండగా నిలువవా..? తన వరకు వస్తే అని ఆలోచించే ధోరణి నాయకులకు ఎప్పుడు పోతుంది? పదుల సంఖ్యలో సంఘాలు ఉండి సాధించిందేమిటి? అవి ఎవరి కోసం పనిచేస్తున్నయి? పని చేయలేని, దుశ్చర్యలను ప్రశ్నించలేని చేవచచ్చిన సంఘాలు అవసరమా?' అని నిలదీస్తున్నారు. ఇంకా 'డబ్బులు తీసుకొని, ఆన్‌డ్యూటీ తీసుకొని, పదవుల పేరిట ప్రకటనలు, ఫొటోలు ఇచ్చుకునే సంఘ నాయకుల్లారా.. మీకు అస్తిత్వం ఉన్నదా..? మీ నాయకులు సస్పెండైతే ఎలా ఒక్కటయ్యారో అమాయకులైన ఉపాధ్యాయులు సస్పెండైతే బలంగా ఎందుకు స్పందించడం లేదు? మహిళా హక్కుల కోసం మాట్లాడే మహిళా మణుల్లారా.. ఇప్పుడెందుకు స్పందించడం లేదు?' అంటూ మండిపడుతున్నారు. 'నాయకుల్లారా ఇప్పటికైనా మీ గొంతు ఎత్తండి' అంటూ సోషల్ మీడియా వేదికగా చేసిన విమర్శలు ప్రస్తుతం ఉపాధ్యాయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ఈ నేపథ్యంలో విద్యాశాఖతో పాటు సంఘా లు ఎలా స్పందిస్తాయో చూడాలి.

### సభ్యత్వాలు, స్వప్రయోజనాలేనా..?

సస్పెన్షన్ల విషయంలో మెజార్టీ ఉపాధ్యాయులు సోషల్ మీడియా వేదికగా సంఘాల నాయకులను తూర్పార పడుతున్నారు. అందుకు అనేక ఉదాహరణలు కూడా చూపుతునారు. ఆ ప్రకారం చూస్తే.. ఇటీవల జరిగిన ఎస్సెస్సీ స్పాట్ సందర్భంగా పలు కారణాలతో ముగ్గురు ఉపాధ్యాయులను డీఈవో సస్పెండ్ చేశారు. అందులో ఇద్దరు సంఘ నాయకులు కూడా ఉన్నారు. దీంతో జిల్లాలోని అన్ని ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఏకతాటిపైకి వచ్చి.. సదరు నాయకుల సస్పెన్షన్ ఎత్తివేయించడంతోపాటు యథాస్థానంలో పోస్టింగ్ ఇచ్చే వరకు పోరాటం చేశారు. సంఘాల పోరాటం, ఒత్తిళ్ల మేరకు.. అధికారులు తలొగ్గి సస్పెన్షన్ ఎత్తివేసి పోస్టింగ్ ఇచ్చారు. ఇదే విషయంలో మరో టీచర్ ఉండగా, ఆయన గురించి ఉపాధ్యాయ సంఘాలు పట్టించుకోలేదు. దీంతో నగునూర్‌లో పనిచేసే సదరు ఉపాధ్యాయుడిని ఏకంగా వీణవంకకు బదిలీ చేశారు. ఒకేసారి సస్పెండ్ అయిన ముగ్గురిలో 'ఇద్దరు నాయకులకు ఒక నీతి.. సాధారణ ఉపాధ్యాయుడికి మరోనీతి' అన్నట్టు సంఘాలు వ్యవహరించాయనే విమర్శలు అప్పుడే వచ్చాయి.

# రైతుల బాధలు పట్టవా..?



మాట్లాడుతున్న రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవీందర్‌సింగ్

- కమీషన్ల కోసమే మంత్రుల తాపత్రయం
- సంపాదన మీద తప్ప ధాన్యం కొనుగోళ్ల మీద ధ్యాస లేదు
- రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవీందర్‌సింగ్ ధ్వజం

కరీంనగర్ కార్పొరేషన్, మే 22: ఓవైపు కొనుగోళ్లలో జాప్యంతో రైతులు ఇబ్బందులు పడుతుంటే, మంత్రులు మాత్రం తాము ఎలా సంపాదించుకోవాలని ప్రణాళికలు వేసుకుంటున్నారని రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవీందర్‌సింగ్ ధ్వజమెత్తారు. రైతుల బాధలు మరిచి మంత్రులు కమీషన్ల కోసం కక్కుర్తి పడుతున్నారని ఆరోపించారు. ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డితోపాటు జిల్లాకు చెందిన మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఇప్పటివరకు ఒక్క సమీక్ష కూడా నిర్వహించలేకపోయారని దుయ్యబట్టారు. కరీంనగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఇంకా 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనాల్సి ఉన్నదని, దానిని ఎప్పుడు కొనుగోలు చేస్తారో..? ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. సన్నబియ్యాన్ని మార్కెట్‌లో ఎక్కడా లేని విధంగా కిలో ₹57 పెట్టి కొనుగోలు చేస్తున్నారని, ఈ కొనుగోళ్లలో ₹300 కోట్లకు పైగా దండుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ధాన్యం కొనుగోలుకు సంబంధించి 33 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యంగా టెండర్ పిలిచారని, కానీ ఇప్పటి వరకు రెండు లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేశారన్నారు. ఈ టెండర్ పొడిగింపు పేరిట ₹700 కోట్లు దండుకోవాలని చూస్తున్నారని, టెండర్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ పొడిగించవద్దని డిమాండ్ చేశారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. కాంగ్రెస్‌నేత రాహుల్‌గాంధీకి ఎంత మొత్తం ముట్టజెప్పాలన్న విషయంలోనే మంత్రులు పోటీ పడుతున్నారని ఆరోపించారు. ఎంత సేపు తమకు వచ్చే కమీషన్లపైనే ద్యాస తప్ప రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు గుంజపడుగు హరిప్రసాద్, తిరుపతి పాల్గొన్నారు.



రాఘవాపూర్ వద్ద పట్టుకున్న మట్టి టిప్పర్లు

# ఇటుక బట్టీలకు అక్రమంగా మట్టి

**తరలిస్తున్న ఎనిమిది టిప్పర్లు సీజ్**


పెద్దపల్లిరూరల్, మే 22: కమాన్‌పూర్ మండలంలోని ఓ చెరువు నుంచి పెద్దపల్లి మండలంలోని పలు ఇటుకబట్టీలకు మట్టిని అక్రమంగా తరలిస్తున్న టిప్పర్లను పెద్దపల్లి తహసీల్దార్ రాజ్‌కుమార్ సీజ్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. పెద్దపల్లి మండలం రాఘవాపూర్ శివారులో బుధవారం మట్టిని తరలిస్తున్న టిప్పర్ ఢీకొనడంతో కారు పాక్షికంగా దెబ్బతిన్నది. స్థానికుల సూచనల మేరకు ఇద్దరూ వాహనదారులు రాజీ కుదుర్చుకున్నారు. అయితే అనుమతి లేకుండా టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నారంటూ కొందరు పెద్దపల్లి ఆర్డీవో గంగయ్యకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఆర్డీవో ఆదేశాల మేరకు పెద్దపల్లి తహసీల్దార్ రాజ్‌కుమార్, ఆర్ఐ నవీన్‌రావు, రెవెన్యూ సిబ్బంది తనిఖీలు చేపట్టారు. అనుమతి పత్రాలు లేకుండా మట్టిని తరలిస్తున్న ఎనిమిది టిప్పర్లను సీజ్ చేసి, పెద్దపల్లికి తరలించినట్లు తహసీల్దార్ తెలిపారు. ఆర్డీవో విచారణ అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

# హాయ్.. హాయ్‌గా

**కూల్ కూల్‌గా స్విమ్మింగ్**



కరీంనగర్: అంబేద్కర్ స్టేడియంలోని స్విమ్మింగ్‌పూల్‌లో ఈత కొడుతున్న చిన్నారులు



కొత్తపల్లి/కోల్‌సిటీ, మే 22 : ఎండ దంచి కొడుతున్నది. గతంలో ఎన్నడూ లేనంతగా ఈ వేసవి భగ్గుమంటున్నది. అయితే ఈ ఎండ నుంచి ఉపశమనంతోపాటు ఆరోగ్యం, ఆహ్లాదం కోసం ఈత నేర్చుకునేందుకు పట్టణాలు, నగరాల్లో ప్రతి ఒక్కరూ స్విమ్మింగ్ పూల్స్ వైపు పరుగులు తీస్తున్నారు. చిన్నా, పెద్దా తేడా లేకుండా ఈత కొట్టేందుకు మక్కువ చూపుతుండగా, ఏటా ఎండకాలంలో స్విమ్మింగ్ నేర్చుకునే వారి సంఖ్య పెరుగుతున్నది. కరీంనగర్‌తో పాటు జిల్లాకేంద్రాలు, గోదావరిఖనిలో స్విమ్మింగ్ పూల్స్ ఉండగా, ఉదయం 6 నుంచి 9 గంటల వరకు.. సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు స్విమ్మింగ్ శిక్షణ ఇస్తున్నారు. ఆయా చోట్ల పిల్లలకు ₹1500 వరకు, పెద్దలకు ₹1700 వరకు తీసుకుంటుండగా.. చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ స్విమ్మింగ్‌లో ఎంజాయ్ చేస్తున్నారు. నగరంలో అయితే అంబేద్కర్ స్టేడియం ఆవరణలోని స్విమ్మింగ్ పూల్‌తోపాటు కరీంనగర్ క్లబ్, జ్యోతినగర్‌లోని సెయింట్ జాన్స్ హైస్కూల్, రేకుర్తిలోని ప్యారడైజ్ హైస్కూల్, బైపాస్ రోడ్డులోని ఫ్లైఓవర్ సమీపంలోని అమన్స్ క్లబ్‌లో స్విమ్మింగ్ శిక్షణ ఇస్తున్నారు. ఒక్క అంబేద్కర్ స్టేడియంలోని పూల్‌లోనే ఈ రెండు నెలల్లో సుమారు వెయ్యి మంది శిక్షణ పొందుతున్నారు. ఎప్పుడు చూసినా రద్దీగా ఉంటున్నది. కొత్తగా అడ్మిషన్లకు అవకాశం లేకుండా పోయింది.



### స్విమ్మింగ్‌తో ఆరోగ్యం



నిరంతరం స్విమ్మింగ్ చేయడం ద్వారా శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండవచ్చు. ఆసక్తి ఉన్న వారు స్విమ్మింగ్‌ను నిరంతరం సాధన చేయడం ద్వారా రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించవచ్చు. ఈ క్రీడలో రాణించేవారికి ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ సైతం ఉంటుంది. పిల్లలకు చిన్నప్పటి నుంచే వారికి నచ్చిన క్రీడల్లో శిక్షణలు ఇప్పిస్తే మెరుగ్గా రాణించే అవకాశముంటుంది. స్టేడియం ఆవరణలోని స్విమ్మింగ్ పూల్‌కు జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీలు నిర్వహించే స్థాయి ఉన్నది.

**- శ్రీకాంత్‌రెడ్డి, డీవైఎస్‌వో (కరీంనగర్)**



ఈత కొడుతూ..



### ఎండకాలంలో ఫుల్ రష్

వేసవిలో స్విమ్మింగ్ ట్రైనింగ్‌కు విపరీతమైన ఆదరణ ఉంటుంది. ఎండకాలం సెలవుల్లో ఫుల్ రష్‌గా ఉంటుంది. మిగతా రోజుల్లో నామమాత్రంగా ఉంటుంది. ఏప్రిల్, మే రెండు నెలల కాలంలో అంబేద్కర్ స్టేడియంలోని స్విమ్మింగ్ పూల్‌లో సుమారు వెయ్యి మంది శిక్షణ తీసుకున్నారు. ఆరోగ్యంతో పాటు ఆహ్లాదానికి స్విమ్మింగ్‌ను ఆశ్రయిస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వేసవి సెలవులు గడిపేందుకు నగరానికి వచ్చే వారు స్విమ్మింగ్ నేర్చుకుంటున్నారు.

**-ఎంద్ర సంపత్, సీనియర్ స్విమ్మింగ్ శిక్షకుడు (కరీంనగర్)**



కరీంనగర్: అంబేద్కర్ స్టేడియంలోని స్విమ్మింగ్‌పూల్‌లో చిన్నారులు



గోదావరిఖనిలో జవహర్‌నగర్‌లోని స్టేడియంలో..

# ప్రిన్సిపాల్ రామకృష్ణకు 'ఇండియన్ ఐకాన్' అవార్డు



రామకృష్ణకు అవార్డు అందిస్తున్న కలెక్టర్

కమాన్‌చౌరస్తా, మే 22: కరీంనగర్ ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామకృష్ణ ఉన్నత విద్యారంగ అభివృద్ధి కోసం 25 ఏండ్లుగా కృషి చేస్తున్నారు. ఈ క్రమంలో ఆయన సేవలను ప్రశంసిస్తూ ఢిల్లీకి చెందిన వందనా సంస్థ, జీసీఆర్ కౌన్సిల్ ఢిల్లీ సంయుక్తంగా ఇండియన్ ఐకాన్ అవార్డును ప్రకటించింది. ఆ అవార్డును కలెక్టర్ పమేలా సత్పతి చేతులమీదుగా ప్రొఫెసర్ రామకృష్ణ బుధవారం అందుకున్నారు. కలెక్టర్‌తోపాటు వైస్ ప్రిన్సిపాల్ టీ రాజయ్య, డాక్టర్ ప్రమోద్, డాక్టర్ కే సురేందర్‌రెడ్డి, డాక్టర్ మల్లారెడ్డి, స్టాఫ్ సెక్రటరీ డాక్టర్ ఆడెపు శ్రీనివాస్, వీ శ్రీనివాస్, డాక్టర్ సతీశ్, డాక్టర్ ఓదెలు కుమార్, ఎన్‌సీసీ అధికారి పీ రాజు, డాక్టర్ మహేశ్, నాగేశ్వర్, లైబ్రేరియన్ కే సురేందర్ అభినందనలు తెలిపారు.

# మైనింగ్ అక్రమాలకు పాల్పడితే చర్యలు

**పెద్దపల్లి కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్**

పెద్దపల్లి, మే 22: ఇసుక, ఇతర గనుల మైనింగ్ అక్రమాలకు ఎవరైనా పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. అక్రమ మైనింగ్‌ను అరికట్టేందుకు నిఘా పెట్టామని, పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. రెవెన్యూ, పంచాయతీ రాజ్, పోలీస్, మైనింగ్, నీటిపారుదల, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి అక్రమ మైనింగ్ నివారణకు కృషి చేయాలని ఆదేశించారు. మానేరు నది వద్ద ఇసుక మైనింగ్‌కు జిల్లాలో ప్రస్తుతం అనుమతి లేదని, మానేరునది పరీవాహక ప్రాంతం నుంచి ఎవరైనా అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో మైనింగ్, ఇసుక అక్ర మ రవాణాపై 7995070699 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు.